క్లుప్తంగా

పౌష్టికాహారం తీసుకోవాలి..

భామిని: గర్భిణులు తప్పనిసరిగా పౌష్టికాహారం తీసుకోవాలని సాలికిరి – బాలేరు సత్య సాయి సేవా సమితి నిర్వాహకులు బోనంగి అర్జున్, యర్నాగుల కృష్ణయ్య అన్నారు. బాలేరులో పలువురు గిరిజన గర్భిణులకు సోమవారం సామూహిక సీమంతం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ. హైందవ సాంప్రదాయాలను పరిరక్షించేందుకు సామూహిక సీమంతం నిర్వహించినట్లు చెప్పారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఎం .జగదీశ్వరరావు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

సికిల్‌సెల్ ఎనీమియాతో యువకుడి మృతి

సీతంపేట: సికిల్‌సెల్ ఎనీమియాతో బాధపడుతూ టి.కిరణ్‌సాయి (23) అనే యువకుడు సోమవారం మృతి చెందాడు. అనారోగ్యంతో బాధపడుతున్న యువకుడ్ని ఇటీవల శ్రీకాకుళం ఆస్పత్రికి తరలించారు. అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం విజయనగరం ఎంఆర్ ఆస్పత్రికి తరలించగా.. అక్కడ చికిత్స పొందుతూ కన్నుమూశాడు. మృతుడి తండ్రి వేణు పాలకొండ ఆర్టీసీ డిపోలో డ్రైవర్‌గా పనిచేస్తున్నారు. చేతికి అంది వచ్చిన కుమారుడు మృతి చెందడంతో కుటుంబ సభ్యులు గుండెలవిసేలా రోధిస్తున్నారు. కిరణ్‌సాయి మృతితో సీతంపేటలో విషాదఛాయలు అలముకున్నాయి.

'మంచి నాయకుడిని కోల్పోయాం'



కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ విక్రాంత్, మాజీ ఎమ్మెల్యే కళావతి

వీరఘట్టం: వైఎస్సార్‌సీపీ ఓ మంచి నాయకుడిని కోల్పోయిందని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి అన్నారు. మండల కేంద్రానికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు లెంక అప్పలనాయుడు మాస్టారు ఆదివారం మృతి చెందడంతో ఆయన కుటుంబ సభ్యులను సోమవారం పరామర్శించి, ఓదార్చారు. పరామర్శించిన వారిలో ఎంపీపీ దమలపాటి వెంకటరమణనాయుడు, భోగి మణి, పిన్నింటి శ్రీను, పాలవలస ధవళేశ్వరరావు, శంభాన శ్రీను, ఉగిరి శ్రీను, అంబళ్ల రవి, గెంబలి మహేష్, రఘుమండల నాగేశ్వరరావు, తదితరులున్నారు.

ఒత్తిడికి గురిచేయడం తగదు



ఎంపీడీఓ రంగారావుకు వినతిపత్రం అందిస్తున్న కార్యదర్శులు

పాలకొండ రూరల్: వివిధ రకాల సర్వేలు, నిర్దేశిత కార్యక్రమాలు నిర్ణత కాలంలో పూర్తి చేయాలని తమను ఒత్తిడికి గురి చేయడం తగదని కార్యదర్శులు ఆవేదన వ్యక్తం చేశారు. పండగలు, సెలవు రోజుల్లో సహితం విధులకు హాజరుకావాల్సి వస్తోందన్నారు. ఈ మేరకు పలువురు కార్యదర్శులు ఎంపీడీఓ వీవీ రంగారావును సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. అధిక పనిభారం నుంచి విముక్తి కల్పించాలని కోరారు.

జాబ్‌మేళా విజయవంతం



జాబ్‌మేళా నిర్వహిస్తున్న దృశ్యం

సాలూరు: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జవహర్ నాలెడ్జ్ సెంటర్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ కెమిస్ట్రీ ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్ మేళా విజయవంతమైంది. సోమవారం నిర్వహించిన ఈ జాబ్‌మేళాలో దివిస్ ల్యాబొరేటరీస్ ఇంటర్వ్యూలకు 65 మంది హాజరుకాగా 46 మంది షార్ట్ లిస్ట్ అయినట్లు ప్రిన్సిపాల్ ఉషశ్రీ తెలిపారు.ఫైనల్‌గా ఎంపికైన అభ్యర్థుల వివరాలు ఈ నెల 31న తెలియచేస్తామని కంపెనీ హెచ్‌ఆర్ మేనేజర్ చెప్పారు. కార్యక్రమంలో వైస్‌ప్రిన్సిపాల్ డా.గొల్ల శ్రీను, జేకేసీ కోఆర్డినేటర్ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



నగర పంచాయతీ అర్బన్ హెల్త్ సెంటర్ ఇదే..



అర్ధంతరంగా నిలిచిన తుమరాడ భవన నిర్మాణం



జంపరకోట గ్రామంలో రూపు కోల్పోతున్న నిర్మాణాలు



దోలమడ గిరిజన గ్రామంలో విలేజ్ క్లినిక్ తాజా స్థితి



పిల్లర్ల స్థాయిలో నిలిచిపోయిన గోపాలపురం విలేజ్ క్లినిక్ భవనం

నిర్మాణాలు పూర్తయ్యేనా..?

చేతిలో సొమ్ము ఉన్నా... లేకున్నా కుటుంబం ఆరోగ్యంగా ఉంటే చాలు అనుకునే వారే ఈ సమాజంలో అధికులు. మధ్య తరగతి కుటుంబాల్లో ఆరోగ్య సమస్య వస్తే చాలు ఆర్థికంగా, మానసికంగా కృంగిపోతారు. వైద్యం కోసం కొంత దూరం వెళ్లాలన్నా ఆలోచనలో పడతారు. తప్పనిసరి పరిస్థితుల్లో అప్పులు చేసి మరీ వైద్యం అందిస్తారు. ఈ సమస్యలన్నీ గుర్తించిన నాటి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఖరీదైన వైద్యం పేదల గడప వద్దకు తీసుకువెళ్లింది. ఫ్యామిలీ డాక్టర్ పేరిట నిపుణులైన వైద్యులు గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి ఉచితంగా సేవలు అందించేవారు. అవసరమైన వారికి మందులు కూడా అందజేసేవారు. ఈ కోవలోనే నాటి ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్‌రెడ్డి ఆయుష్ ఆరోగ్య మందిర్ (ఏఏఎం) విలేజ్ క్లినిక్ పేరిట నిర్మాణాలకు శ్రీకారం చుట్టారు. పాలకొండ మండలంలో ఇప్పటికే అన్నవరం, ఎం.సింగుపురంలో పీహెచ్‌సీలున్నాయి. ఒక్కో పీహెచ్‌సీ పరిధిలో 10 విలేజ్ క్లినిక్‌ల ఏర్పాటుకు రంగం సిద్ధం చేశారు. రూ.17.50 లక్షల అంచనా వ్యయంతో 20 నూతన భవనాలు నిర్మించాలని భావించారు. ప్రజలకు ఇళ్ల వద్దే వైద్యం అందించాలని నాటి ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఈ కార్యక్రమం చేపట్టింది. గ్రామ సచివాలయ పరిధిలో నూతన భవన నిర్మాణాలు యుద్ధప్రాతిపదికన చేపట్టారు. వీటితోపాటు స్థానిక నగర పంచాయతీలో రూ.80 లక్షల అంచనాలతో అర్బన్ హెల్త్ సెంటర్ నూతన భవన నిర్మాణాలను దాదాపు 85 శాతం పూర్తి చేశారు. అతి త్వరలో ప్రజలకు మెరుగైన వైద్యం చేరువవుతుందనుకున్న సమయంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. అప్పటి నుంచి భవన నిర్మాణ పనులు నిలిచిపోయాయి. ఆరోగ్య కేంద్రాలకు సుస్తి చేసి అనారోగ్య కేంద్రాలుగా మారాయి. ఈ నిర్మాణాలపై అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ప్రభుత్వ భవనాలు రూపుకోల్పోతున్నాయని గ్రామస్తులు చర్చించుకుంటున్నారు. – పాలకొండ రూరల్

అంగరంగ వైభవంగా లక్ష్మీగణపతి కల్యాణం..



సీతంపేట మండల కేంద్రంలోని లక్ష్మీ గణపతి ఆలయ ప్రాంగణంలో సిద్ధి, బుద్ధి సమేత లక్ష్మీ గణపతి స్వామి కల్యాణం సోమవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ప్రధానార్చకుడు వేమకోటి సాయికృష్ణ శర్మ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. కార్యక్రమంలో భాగంగా మధ్యాహ్నం అన్నదానం నిర్వహించారు. - సీతంపేట

నిర్దేశిత గడువులోగా సర్వే పూర్తి చేయండి

గరుగుబిల్లి: నిర్దేశిత గడువులోగా పీ4(పబ్లిక్ ప్రైవేట్ పీపుల్స్ పార్టనర్‌షిప్) సర్వేను పూర్తి చేయాలని ఎంపీడీవో జి.పైడితల్లి ఆదేశించారు. మండలంలోని కొత్తపల్లి గ్రామంలో చేస్తున్న ఆ సర్వేను ఆమె సోమవారం తనిఖీ చేశారు. సర్వే ఏ మేర జరిగిందని ఆరాతీసి, సర్వేను వేగవంతం చేయాలని సూచించారు. అట్టడుగు స్థాయిలోని 20 శాతం నిరుపేదలను గుర్తించి, వారిని ఆర్థికంగా బలోపేతం చేయాలనే లక్ష్యంతో ఈ సర్వే జరుగుతోందని, దీనికి ప్రజలు కూడా సహకరించాలని కోరారు. ఈ సర్వేలో 27 ప్రశ్నల ద్వారా సమాచారం సేకరించడం జరుగుతోందన్నారు. కార్యక్రమంలో సిబ్బంది ఎస్.కులశేఖర్, జి.కృష్ణప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



సర్వేపై ఆరాతీస్తున్న ఎంపీడీవో పైడితల్లి

'యువత పోరు'కు తరలిరావాలి



జియ్యమ్మవలస రూరల్: వాల్‌పోస్టర్ విడుదల చేస్తున్న మాజీ డిప్యూటీ సీఎం పుష్పశ్రీవాణి, తదితరులు

జియ్యమ్మవలస రూరల్: పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రంలో వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో ఈ నెల 12వ తేదీన జరిగే యువత పోరు కార్యక్రమానికి పార్టీ శ్రేణులతో పాటు నిరుద్యోగులు, యువత, విద్యార్థులంతా హాజరుకావాలని మాజీ డిప్యూటీ సీఎం పాముల పుష్పశ్రీవాణి పిలుపునిచ్చారు. కురుపాం మండలంలోని చినమేరంగి గ్రామంలోని తన క్యాంపు కార్యాలయంలో ఆమె యువత పోరు కార్యక్రమ వాల్‌పోస్టర్‌ను సోమవారం ఆవిష్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఏటా జాబ్ క్యాలెండర్ ఇచ్చి ఉద్యోగాల భర్తీ చేస్తామని నిరుద్యోగులను, ఉద్యోగాలు ఇస్తామని యువతను, ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వకుండా విద్యార్థులను కూటమి ప్రభుత్వం మోసం చేస్తోందని విమర్శించారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిపై నినదించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. ఆయా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా చేపట్టే యువత పోరు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

గరుగుబిల్లి: కూటమి ప్రభుత్వ హయాంలో విద్యార్థులు, యువత, నిరుద్యోగులకు జరుగుతున్న అన్యాయంపై వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో ఈ నెల 12వ తేదీన చేపట్టబోయే యువత పోరు కార్యక్రమానికి అందరూ తరలిరావాలని జెడ్పీ వైస్ చైర్మన్ మరిశర్ల బాపూజీనాయుడు, మండల కన్వీనర్ కేతిరెడ్డి అచ్యుతరావు పిలుపునిచ్చారు. ఇదే విషయమై వారు సోమవారం విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల సమయంలో అధికారంలోకి రాగానే ఇంటికో ఉద్యోగం ఇస్తామని యువతను, ఏటా ఉద్యోగాలు భర్తీ చేస్తామని నిరుద్యోగులను, ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇస్తామని విద్యార్థులను నమ్మబలికి ఓట్లు వేయించుకున్నారని, తీరా అధికారంలోకి వచ్చిన తర్వాత వారికి ఇచ్చిన ఏ హామీ ఇంతవరకు అమలు చేయలేదని ధ్వజమెత్తారు. ఎన్నికల హామీల అమలులో ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిపై గళమెత్తాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. యువత పోరు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. అలాగే అదేరోజు పార్టీ ఆవిర్భావ దినోత్సవం నిర్వహిస్తున్నామని, పార్టీ శ్రేణులంతా హాజరుకావాలన్నారు. మండలంలోని ఖడ్గవలస జంక్షన్‌లోని వైఎస్సార్ విగ్రహానికి పార్టీ జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్‌రాజు, మాజీ డిప్యూటీ సీఎం పాముల పుష్పశ్రీవాణిలు పూలమాలలు వేసి, నివాళులర్పిస్తారన్నారు. ఉదయం 8 గంటలకు జరిగే ఈ కార్యక్రమానికి అందరూ రావాలని, యువత పోరు కార్యక్రమంలో భాగంగా అక్కడి నుంచి కలెక్టరేట్‌కు ర్యాలీగా వెళ్లడం జరుగుతుందన్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరించండి

పార్వతీపురంటౌన్: తమ గ్రామంలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని కొమరాడ మండలం చినఖేర్జల పంచాయతీ సర్వపాడు గ్రామస్తులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్ ఆవరణలో నిరసన తెలియజేశారు. అనంతరం కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ తమ గ్రామంలో 150 కుటుంబాలు ఉన్నాయని, గ్రామానికి ఒక వాటర్ ట్యాంక్ ఉందని, దాని వల్ల ఎటువంటి ఉపయోగం లేదని వాపోయారు. వాటర్ ట్యాంక్‌లో నీరు నింపడానికి బోరు నీరు సరిపోవడం లేదన్నారు. ఉన్న బోరు కూడా సరిగ్గా పనిచేయడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. రానున్న వేసవి దృష్ట్యా ఈ సమస్యలు పరిష్కరించి తమ గ్రామానికి తాగు నీటిని అందజేయాలని కోరారు.

రెండు పూటలా ఉపాధి పనులు

గరుగుబిల్లి: రెండు పూటలా ఉపాధి హామీ పథకం పనులు చేయాలని ఎంపీడీవో జి.పైడితల్లి ఆదేశించారు. మండలంలోని పెద్దూరులో జరుగుతున్న ఉపాధి పనులను ఆమె సోమవారం పరిశీలించారు. కొలతల ప్రకారం పనులు చేస్తే రోజుకు రూ.300 వేతనం గిట్టుబాటు అవుతుందన్నారు. పనిలోకి వచ్చిన వారికే మస్తర్లు వేయాలని, బోగస్ మస్తర్లు వేస్తున్నట్లు తెలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. వేసవి నేపథ్యంలో పని ప్రదేశంలో తాగునీరు, నీడ కోసం టెంట్లు, ప్రథమ చికిత్స కిట్ వంటివి ఉంచుకోవాలన్నారు. ఆమె వెంట ఏపీవో గౌరీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

పిచ్చిమొక్కలు తొలగించండి

వీరఘట్టం: మండల కేంద్రం నుంచి చలివేంద్రి మీదుగా సంత–నర్సిపురం వరకు ఉన్న ఆర్అండ్‌బీ రోడ్డుకు ఇరువైపులా పేరుకుపోయిన పిచ్చి మొక్కలు తొలగించాలని చలివేంద్రికి చెందిన పలువురు కోరినట్లు ఎంపీడీఓ బి. వెంకటరమణ తెలిపారు. రోడ్డుకిరువైపులా పిచ్చిమొక్కలు ఏపుగా పెరగడంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక ప్రమాదాలు జరుగుతున్నట్లు గ్రామస్తులు వినతిలో పేర్కొన్నారన్నారు. విషయాన్ని ఆర్అండ్‌బీ అధికారుల దృష్టికి తీసుకెళ్లి జంగిల్ క్లియరెన్స్ చేపడతామని ఎంపీడీఓ తెలిపారు.

జీసీసీ ద్వారా జీడిపిక్కలు కొనుగోలుకు డిమాండ్



మాట్లాడుతున్న రైతు సంఘం నాయకుడు అప్పలనాయుడు

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): జీసీసీ, రైతు సేవా కేంద్రాల ద్వారా జీడిపిక్కలు కొనుగోలు చేయాలని ఏపీ రైతు సంఘం నాయకుడు బిడితి అప్పలనాయుడు డిమాండ్ చేశారు. కురుపాం మండలంలోని పి.లేవిడి గ్రామ సమీపంలోని ఓ జీడిమామిడి తోటలో రైతు సంఘం నాయకులు, రైతులతో ఆయన సోమవారం సమావేశమయ్యారు. ఇతర వ్యవసాయ పంటలు మాదిరిగానే జీడిపిక్కలకు కూడా ప్రభుత్వమే మద్దతు ధర ప్రకటించి, కొనుగోలు చేయాలని కోరారు. క్వింటాకు రూ.20 వేలు మద్దతు ధర ఇవ్వాలన్నారు. అలాగే జీడిమామిడి ప్రాసెసింగ్ యూనిట్లను ఏర్పాటు చేయాలన్నారు. జీడిమామిడి పంటకు పట్టే తెగుళ్ల నివారణకు మందు పిచికారీ కోసం డ్రోన్ పరికరాలను అందుబాటులోకి తీసుకురావాలన్నారు. ఈ నెల 11 నుంచి 17వ తేదీ వరకు జీడిపిక్కలను ఆయా కేంద్రాల్లో కొనుగోలు చేయాలని విజ్ఞప్తి చేస్తూ సచివాలయాల్లో వినతి పత్రాలు అందించే కార్యక్రమం చేపడుతున్నామని, ఇదే నెల 20వ తేదీన కలెక్టరేట్ వద్ద ధర్నాకు సిద్ధమవుతున్నామన్నారు. అనంతరం జీడిమామిడి రైతుల జిల్లా కమిటీ ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పువ్వల ప్రసాద్, సింగన్న, రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల్లేక ఇక్కట్లు..

సీపీఎం నాయకులు

పాలకొండ: పట్టణంలోని గారమ్మకాలనీలో తక్షణమే మౌలిక వసతులు కల్పించాలని సీపీఎం నాయకులు ఎం. తిరుపతిరావు, డి. రమణారావు డిమాండ్ చేశారు. సీపీఎం ప్రజా చైతన్యయాత్రలో భాగంగా గారమ్మకాలనీలో సీపీఎం బృందం సోమవారం పర్యటించింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాలనీలో 30 వీధులుంటే పది వీధుల్లో మాత్రమే సీసీ రహదారులున్నాయని తెలిపారు. కాలువలు లేక మురుగునీరు వీధుల్లో నిలిచిపోతుందని.. దీంతో ఈగలు, దోమలు వృద్ధి చెంది అంటు రోగాలు ప్రబలుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. 15 రోజుల్లో సమస్యలు పరిష్కరించకపోతే నగర పంచాయతీ కార్యాలయం ముందు ఆందోళన చేపట్టక తప్పదన్నారున. కార్యక్రమంలో కె. రాము, డి. దుర్గారావు, తదితరులు పాల్గొన్నారు.



గారమ్మ కాలనీలో సమస్యలు తెలుసుకుంటున్న సీపీఎం నాయకులు

మహిళలు అన్నిరంగాల్లో ముందుండాలి

గుమ్మలక్ష్మీపురం: మహిళలు అన్నిరంగాల్లో ముందుండాలని ఆర్ట్స్ సంస్థ రాష్ట్ర కో–ఆర్డినేటర్ సందీప్ పిలుపునిచ్చారు. మండలంలోని తాడికొండ గ్రామంలో ఆర్ట్స్ సంస్థ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సోమవారం నిర్వహించి, వివిధ రంగాల్లో ప్రజలకు సేవలందిస్తున్న మహిళలను సన్మానించారు. ఆయన మాట్లాడుతూ పురుషులతో సమానంగా మహిళలకు అవకాశాలు ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకుని, ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలని, అప్పుడే సమాజ అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో ఆర్ట్స్ సంస్థ ఫీల్డ్ కో–ఆర్డినేటర్ చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.



మహిళలను సన్మానిస్తున్న ఆర్ట్స్ సంస్థ ప్రతినిధులు

గిరిజన ఉత్పత్తులకు మద్దతు ధర

ఆదివాసీ గిరిజన సంఘ నాయకులు

పాలకొండ: గిరిజనులు పండిస్తున్న పంటలకు మద్దతు ధర కల్పించాలని ఆదివాసీ గిరిజన రైతుల సంఘ నాయకులు కోరారు. ఈ మేరకు సోమవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ బాల మురళీకృష్ణను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. పాలకొండ మండలంలో 7 పంచాయతీల్లో 3,500 మంది గిరిజనులు నివసిస్తున్నారని తెలిపారు. ఇక్కడ సరైన మార్కెట్ లేక పంటలకు మద్దతు ధర లభించడం లేదన్నారు. 80 కిలోల జీడిపిక్కల బస్తా ప్రభుత్వమే రూ. 18 వేలకు కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే మండలంలో జీడి ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎ.భానుచందర్, రామారావు, అశోక్, తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న గిరిజన సంఘాల నాయకులు

పాముకాటుతో అస్వస్థత

సీతంపేట: మండలంలోని దాసుగుమ్మడ గ్రామానికి చెందిన సనోరమ్మ అనే మహిళ పాముకాటుకు గురై తీవ్ర అస్వస్థతకు గురైంది. వివరాల్లోకి వెళితే.. సోమవారం ఉదయం గ్రామ సమీపంలోని జీడితోటకు వెళ్లి పొదలు కొడుతుండగా.. విషసర్పం కాటు వేసింది. వెంటనే సమీపంలో ఉన్న వారు ఆమెను స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం 24 గంటలు అబ్జర్వేషన్‌లో ఉంచినట్లు సూపరింటెండెట్ బి. శ్రీనివాసరావు తెలిపారు.

చిత్రలేఖనం పోటీల్లో సత్తా..



పాలకొండ మండలంలోని తంపటాపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు నెల్లూరు అమీర్ ఆర్ట్స్ అకాడమీ ఇటీవల నిర్వహించిన అఖిల భారత బాలల చిత్రలేఖన పోటీల్లో సత్తా చాటి బంగారు పతకాలు సాధించారు. ఈ మేరకు విజేతలను సోమవారం స్థానిక పాఠశాల ఆవరణలో హెచ్‌ఎం టి.పద్మావతి ఆధ్వర్యంలో సిబ్బంది అభినందించారు. ఈ సందర్భంగా డ్రాయింగ్ ఉపాధ్యాయుడు జి. మురళి మాట్లాడుతూ.. పాఠశాలలో 7, 9, 10 తరగతులు చదవుతున్న ఎం.రోహిత్, కె.ప్రసన్న రామ్, కె.హిమబిందు చిత్రలేఖనం పోటీల్లో బంగారు పతకాలు దక్కించుకున్నారన్నారు. అలాగే అస్సాంలో గల లలిత కళా కేంద్రంలో చేపట్టిన మరో చిత్రలేఖనం పోటీల్లో కూడా తమ పాఠశాలకు చెందిన ఆరుగురు విద్యార్థులు అవార్డులు పొందారని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. - పాలకొండ రూరల్



ఏజెన్సీలోని దట్టమైన అటవీ ప్రాంతంలో లభించే విప్పపువ్వు.. గిరిజనులకు కల్పతరువు లాంటిది. సహజసిద్ధమైన ఔషధ గుణాలు కలిగిన ఇవి ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. అంతేకాకుండా వీటిని ఆయుర్వేద మందుల తయారీలో కూడా వినియోగిస్తారు. ఏటా మార్చి, ఏప్రిల్ నెలల్లో ఇవి విరివిగా దొరుకుతాయి. గిరిజనులంతా వీటిని సేకరించి, జీసీసీ కేంద్రాల ద్వారా విక్రయించి, మంచి లాభం పొందుతారు. ప్రస్తుతం ఈ విప్పపువ్వులను సేకరించి, ఎండలో ఆరబెట్టే పనిలో ఆదివాసీలంతా నిమగ్నమయ్యారు. లప్పటిలోని గిరిజనులు సేకరించిన విప్పపువ్వును ఈ చిత్రంలో చూడొచ్చు. –గుమ్మలక్ష్మీపురం

• వినతి..

ప్రభుత్వం మంజూరు చేసిన పీఎం జన్‌మాన్ గృహాల నిర్మాణానికి అనువుగా ఇళ్ల స్థలాల పొజిషన్ సర్టిఫికెట్లు ఇవ్వాలని పలువురు ఆదివాసీ గిరిజనులు కోరారు. ఈ మేరకు గిరిజన సంఘం ఆధ్వర్యంలో తహసీల్దార్ నీలాపు అప్పారావును సోమవారం కలసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కోటకొండ, కోసింగిగూడ, బంద్రసింగి, కడంబసింగి, గేదెలగూడ, నడిమిగూడ, భూర్జగూడ, డోకులగూడ, రేగిడి గిరిజన గ్రామాలకు చెందిన ఆదివాసీలు మాట్లాడుతూ.. పొజిషన్ సర్టిఫికెట్లు ఇవ్వకపోవడంతో నిర్మాణాలు చేపట్టలేకపోతున్నామన్నారు. దీనికి తహసీల్దార్ స్పందిస్తూ సమస్యను ఐటీడీఏ పీఓ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో గిరిజన సంఘ కార్యదర్శి కొండగొర్రి భాస్కరరావు, తదితరులున్నారు. - భామిని

